క్లుప్తంగా

ఘనంగా ప్రతిష్టా మహోత్సవాలు

నందిగామటౌన్‌:మండలంలోని బబ్బెళ్లపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో అంకమ్మ అమ్మవారు, పోతురాజు, పరివారముల పాంచాహ్నిక ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాల్లో భాగంగా సోమవారం తోరణం కట్టుట, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, పంచగవ్యప్రాసన, రక్షాబంధనం, దీక్షాధారణ, మాతృకా పూజలు, యాగశాల ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి అఖండ దీపారాధన, షోఢవస్తంభ పూజలు, మృతగ్రహారాం, అంకురారోపణ దేవతాహ్వానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు



వీరులపాడు(కంచికచర్ల): ఇటీవల గుంటూరు విజ్ఞాన యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ కార్యక్రమంలో తమ విద్యార్థులు సుమధుర స్వరాలు పలికించి విజేతలుగా నిలిచారని ఏకత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయిని అడపా నాగసూర్యవతి తెలిపారు. విజేతలకు పాఠశాలలో సోమవారం అభినందనసభ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల అకడమిక్ డైరెక్టర్ అమరనేని సింధూర మాట్లాడుతూ తమ విద్యార్థులు పాటలు, వ్యాసరచన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారని వివరించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంతోపాటు పలు క్రీడారంగంలో మంచి తర్ఫీదు ఇస్తున్నామని వివరించారు. బహుమతులు సాధించిన విద్యార్థులతోపాటు సంగీత ఉపాధ్యాయులు తేరా రాహుల్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు



కంచికచర్ల: రోడ్డుపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొనగా లారీడ్రైవర్ కాలు తెగిపడిన సంఘటన సోమవారం కంచికచర్ల మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నాగార్జునసాగర్ కాల్వ సమీపంలో జాతీయ రహదారి మధ్య డివైడర్‌లోని మొక్కలను నీరుపట్టే లారీని విశాఖపట్నం నుంచి జగ్గయ్యపేట సిమెంట్ కర్మాగారానికి జిప్సమ్‌లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీడ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అతని కాలు తెగిపడింది. ఇతనిది తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మునగాలపల్లి మండలం నరసింహగూడెం. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న నాగార్జునను ఎట్టకేలకు బయటకు తీసి వైద్య చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

నందిగామటౌన్‌: తాటిచెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికునికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు..మండలంలోని అంబారుపేట గ్రామానికి చెందిన కొనగంటి చక్రబాబు కల్లుగీత కార్మికునిగా జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం కూడా గ్రామ సమీపంలోని తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి చెట్టుపై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రకృతి వ్యవసాయ విధానంతో ఎంతో మేలు



జగ్గయ్యపేటఅర్బన్‌: షేర్‌మహ్మద్‌పేటలోని ప్రకృతి వ్యవసాయం కేంద్రం(ఏపీ కమ్యూనిటీ నేచర్ ఫాం)లో ఎటువంటి రసాయనిక ఎరువులు లేకుండా ఆకుకూరలు, కూరగాయలను పండిస్తున్నట్లు ఏపీసీఎన్‌ఎఫ్ కేంద్రం స్టాఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ నాగేంద్ర తెలిపారు. ప్రకృతి వ్యవసాయకేంద్రంలో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో జగ్గయ్యపేట పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం స్టాల్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. రసాయనిక ఎరువుల వినియోగించి పండించిన కూరగాయలు తినడం ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నారు. సంప్రదాయపద్ధతిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలను ప్రజలు వినియోగించాలని ఆయన కోరారు.

టీడీపీ వర్సెస్ ఎమ్మెల్యే సౌమ్య!

- ముస్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి కేంద్రంగా వివాదం
- గ్రూపులుగా విడిపోయిన నేతలు
- ఎమ్మెల్యే సౌమ్యకు షాకిచ్చిన అధిష్టానం
- అధిష్టానానికి ఝలక్ ఇచ్చిన ఎమ్మెల్యే

టీడీపీలో కుమ్ములాట



నందిగామటౌన్‌: నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక వ్యవహారం టీడీపీలో కుమ్ములాటకు దారి తీసింది. ఛైర్మన్ పదవి నాదంటే నాదంటూ ఆ పార్టీలోని ఆశావాహులు ఎవరికి వారు ప్రయత్నాలు చేసుకుంటుండగా, ఛైర్‌పర్సన్ అభ్యర్థి అంశం సోమవారం కూడా తేలకపోవడంతో వారంతా తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఛైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపిక వ్యవహారం చివరికి టీడీపీ అధిష్టానం వర్సెస్ నందిగామ ఎమ్మెల్యే అన్నట్లు మారిపోయింది. దీంతో నందిగామలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

అధిష్టానంపై ఎమ్మెల్యే ధిక్కార స్వరం..

టీడీపీ అధిష్టానం శాఖమూరు స్వర్ణలతను ఛైర్‌పర్సన్ పదవికి ఖరారు చేయగా...నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మాత్రం కామసాని సత్యవతికే ఛైర్‌పర్సన్ పదవి ఇవ్వాలని పట్టుబట్టినట్లు టీడీపీ వర్గాల సమాచారం. టీడీపీ అధిష్టానం నిర్ణయాన్ని ఎమ్మెల్యే సౌమ్య ధిక్కరించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. స్వర్ణలత, సత్యవతి ఇద్దరు కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనప్పటికీ సొంత సామాజికవర్గంలో సింహభాగం స్వర్ణలతకు మద్దతుగా నిలుస్తుండటం గమనార్హం.

బయటపడిన గ్రూపు రాజకీయాలు..

మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి విషయంలో టీడీపీలో గ్రూపు రాజకీయాలు గుప్పుమన్నాయి. ముఖ్యంగా ఛైర్‌పర్సన్ పదవి కోసం ఎనిమిదో వార్డు కౌన్సిల్ సభ్యురాలు శాఖమూరు స్వర్ణలత, 14వ వార్డు కౌన్సిల్ సభ్యురాలు కామసాని సత్యవతి, ఐదోవార్డు కౌన్సిల్ సభ్యురాలు యేచూరు రత్నకుమారి, 10వ వార్డు కౌన్సిల్ సభ్యురాలు మండవ కృష్ణవేణి బరిలో నిలిచారు. వీరిలో ప్రధానంగా కామసాని సత్యవతి, శాఖమూరు స్వర్ణలత మధ్య తీవ్రపోటీ నెలకొంది. కామసాని సత్యవతికి ఛైర్‌పర్సన్ పదవి కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే సౌమ్య సుముఖత వ్యక్తం చేస్తుండగా, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తోపాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సైతం శాఖమూరు స్వర్ణలత అభ్యర్థిత్వానికే మొగ్గుచూపినట్లు సమాచారం.

విప్‌ను ధిక్కరిస్తున్న ఎమ్మెల్యే?..

శాఖమూరు స్వర్ణలతను ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా నిర్ణయించిన టీడీపీ అధిష్టానం ఆమెకు బీఫారం పంపినప్పటికీ ఎమ్మెల్యే సౌమ్య అందుకు ఒప్పుకునేది లేదని ఖరాఖండిగా చెప్పారనే చర్చ ఆపార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. పార్టీ అండ, మాకష్టంతో ఎమ్మెల్యేగా గెలుపొందిన సౌమ్య చివరికి పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించేలా వ్యవహరించడమేమిటంటూ ఆమె వ్యతిరేకవర్గ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఒకదశలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఫోన్‌చేసి విప్‌కు అనుగుణంగా ఛైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపికను పూర్తిచేయాలని ఎమ్మెల్యే సౌమ్యను కోరినా ఫలితం లేకపోయిందనే చర్చ నందిగామలో జోరుగా సాగుతోంది. స్వర్ణలతను ఛైర్‌పర్సన్ ప్రకటిస్తే తాము ఛైర్మన్ ఎన్నికను బాయ్‌కాట్ చేస్తామని ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు చెబుతుండటం టీడీపీలోని వర్గ రాజకీయాలను మరోసారి బహిర్గతం చేసింది.

ఎమ్మెల్యే కనుసన్నల్లోనే కౌన్సిలర్లు..

ఎమ్మెల్యే సౌమ్య టీడీపీకి చెందిన కౌన్సిల్ సభ్యులతోపాటు పార్టీ ఫిరాయించిన సభ్యులతో కలిపి మొత్తం 13మందిని సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తన నివాసంలోనే అందుబాటులో ఉంచినట్లు విశ్వసనీయం సమాచారం. 13మంది కౌన్సిల్ సభ్యులు అందుబాటులో ఉండటంతోపాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తంగిరాల సౌమ్య తన నియోజకవర్గంలోని ఛైర్‌పర్సన్ అభ్యర్థిని తాను నిర్ణయించలేకపోవడం రాజకీయవర్గాల్లో కొత్తచర్చకు తావివ్వగా.. టీడీపీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థికి కాకుండా మరొకరికి బీఫారం ఇవ్వడం ద్వారా నియోజకవర్గ పార్టీలో తనపట్టును చూపించేందుకు ఎమ్మెల్యే సైతం పార్టీ అధిష్టానానికి షాకిచ్చినట్లయిందని రాజకీయపరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇలా నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక వ్యవహారం టీడీపీ వర్సెస్ ఎమ్మెల్యే సౌమ్యగా మారిపోయింది. ఈ విషయంలో చివరికి టీడీపీ అధిష్టానం నిర్ణయం అమలవుతుందో లేక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తన పంతం నెగ్గించుకుంటుందో వేచిచూడాల్సిందే.

కోరం లేక ఛైర్‌పర్సన్ ఎన్నిక నేటికి వాయిదా



నందిగామటౌన్‌: మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక మంగళవారానికి వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి, ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించగా, మధ్యాహ్నం 12గంటల వరకు ఐదుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఎన్నికకు అవసరమైన 50శాతం మంది సభ్యులతో కూడిన కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేసినట్లు ఆర్డీఓ ప్రకటించారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ కొనసాగుతుందని ఆర్డీఓ వెల్లడించారు.

నేడు హుండీల లెక్కింపు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్‌ఎన్ కిషోర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 8 గంటలకు జరిగే ఈ లెక్కింపులో సిబ్బందితోపాటు ఆసక్తిగల భక్తులు కూడా పాల్గొనవచ్చని ఆయన సూచించారు.

ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్‌:పట్టణంలోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయం ప్రాంగణంలో వేద పండితులు మంత్రోచ్చారణలతో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రంగాపురం నరసింహారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైద్య ఉద్యోగి మృతి


నవ్య (ఫైల్)

తిరువూరు: గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌గా విధులు నిర్వహిస్తున్న నవ్య (23) అనారోగ్యంతో మృతి చెందారు. పెనుగంచిప్రోలు మండలం సుబ్బయ్యగూడెం గ్రామానికి చెందిన ఆమె గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతూ విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం తెల్లవారు ఝామున ఆమె మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు అవివాహిత.

ఘనంగా వసంత పంచమి వేడుకలు


గంద్రాయిలో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేట: వసంత పంచమి సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సోమవారం సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతీ అమ్మవారి జన్మదినం సందర్భంగా అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గంద్రాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు పెన్నులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు సుబ్బారావు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అన్నవరం, వేదాద్రి, ధర్మవరప్పాడుతండ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు.

విద్యార్థులకు పలకలు పంపిణీ...

జగ్గయ్యపేటఅర్బన్‌: వసంత పంచమి సందర్భంగా స్థానిక 22వ వార్డులోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీవాసవీ సేవాసమితి వారి ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. శ్రీవాసవీ సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరపర్తి సోమేశ్వరరావు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి మహిళా విభాగం అధ్యక్షురాలు వాసా నాగమణి, కార్యదర్శి దారా సూర్యకళ రాజా, అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో వేడుకలు..

జగ్గయ్యపేట పట్టణంలోని విద్యాసంస్థల్లో వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అదేవిధంగా శ్రీగురుధాం వ్యవస్థాపకులు, తాత్వికులు గెంటేల వెంకటరమణ విద్యార్థులచే ప్రార్థన చేయించారు.

సామూహిక అక్షరాభాస్యం..

నందిగామటౌన్‌: మండలంలోని ఆయా గ్రామాలతోపాటు పట్టణంలోని ఆలయాలలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంతో పాటు మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు వేదమంత్రోచ్ఛరణల నడుమ సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. అమ్మవారి పూజ చేసిన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను చిన్నారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

కొణకంచి(పెనుగంచిప్రోలు):స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. పూజ అనంతరం విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామచంద్రుడు, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ పద్మ, టీచర్ అమృత, విద్యార్థులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: వసంతపంచమి వేడుకను మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, చిట్టేల, మక్కపేట, భీమవరం, మంగొల్లు గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మక్కపేట శ్రీ సాయిసెంచరీ హైస్కూల్‌లో చిన్నారులకు సామూహిక అక్షర్యాభ్యాస కార్యక్రమాన్ని కరస్పాండెంట్ కేఆర్ సవితా భరద్వాజ్ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పేట 22వవార్డులో చిన్నారులకు పలకలు పంపిణీ చేస్తున్న శ్రీవాసవీ సేవాసమితి ప్రతినిధులు


జగ్గయ్యపేట విజ్ఞాన్ స్కూల్‌లో..


మక్కపేటలో సాయిసెంచరీలో పూజలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కొణకంచిలో పూజలు చేస్తున్న గ్రంథాలయాధికారి రామచంద్రుడు, టీచర్లు, విద్యార్థులు


పల్లగిరి త్రిశక్తిపీఠంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న తల్లిదండ్రులు

అమ్మవారి కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం


గోటితో వలిచిన తలంబ్రాలు బియ్యాన్ని ఊరేగింపుగా తెస్తున్న భక్తులు


కల్యాణ తలంబ్రాలు కలుపుతున్న భక్తులతో ఆలయ ఛైర్మన్ శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ తలంబ్రాలను కలిపే కార్యక్రమాన్ని ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 11న జరిగే శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణం అనంతరం భక్తులకు తలంబ్రాలు అందించేందుకు క్వింటా బియ్యాన్ని ముందుగా పసుపు, కుంకుమ, నెయ్యి, పలు సుగంధ ద్రవ్యాలతో భక్తులచే కలిపించారు. ముందుగా గ్రామంలోని రంగుల మండపం వద్ద నుంచి భక్తులు గోటితో వలిచిన తలంబ్రాలు బియ్యాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. వీటిలో కల్యాణ తలంబ్రాలను కలిపి కల్యాణ వేదిక వద్ద నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి అమ్మవారి కల్యాణం అనంతరం భక్తులందరికీ పంపిణీ చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సతీమణి అమ్మాజీ, బీజేపీ జిల్లా నాయకురాలు కల్లూరి శ్రీవాణి, మాజీ సర్పంచ్ చింతల శ్రీలక్ష్మి, పాలకవర్గ సభ్యులు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పిల్లి మాణిక్యరావు, ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట అర్బన్‌: నేటి ఆధునిక సమాజంలో యాంత్రిక జీవితం నుంచి బయటపడి ఉపశమనం పొందేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ గ్రౌండ్‌లో జగ్గయ్యపేట క్రికెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగ్గయ్యపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక నేతలతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా మరలా గెలిచేందుకు రెట్టింపు ఉత్సాహంతో కృషిచేయాలని సూచించారు. లిడ్క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, దొంతు చిన్న, శ్రీరాం చినబాబు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, కౌన్సిలర్లు గొట్టె నాగరాజు, సంగెపు బుజ్జిబాబు, గింజుపల్లి వెంకట్రావు, పేరం సైదేశ్వరరావు, ఇర్రి నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు, క్రికెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు సిద్ధార్థలో కెమ్‌క్వెస్ట్-2025

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రసాయన శాస్త్రం చదువుతున్న విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి కెమ్‌క్వెస్ట్-2025 పేరుతో ఈ నెల 5వ తేదీ బుధవారం సిద్ధార్థ ఆడిటోరియంలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలో కెమ్‌క్వెస్ట్-2025కి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. రమేష్ మాట్లాడుతూ స్టూడెంట్ అసోసియేషన్ ఆఫ్ కెమికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కెమిస్ట్రీ విభాగాధిపతి పీటీఎస్ఆర్‌కే ప్రసాదరావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఈగల్ వింగ్ ఐజీ రవికృష్ణ



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ ఎస్‌వీ.రాజశేఖరబాబు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు చెప్పారు. సే నో టు డ్రగ్స్ పేరుతో విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజశేఖరబాబు హాజరై మాట్లాడారు. డ్రగ్స్‌తో జీవితాలు నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని నివారించడానికి ఈగల్ విభాగం ఏర్పాటైందన్నారు. డ్రోన్స్ ద్వారా గంజాయి సాగు ఎక్కడ జరుగుతుందో గుర్తించి నాశనం చేస్తున్నామని చెప్పారు. గంజాయి సేవించిన వారికి ఎన్డీపీఎస్ యాక్ట్ ప్రకారం శిక్ష పడుతుందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన స్నేహితులకు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ సేవించాలని బలవంతం చేస్తే ధైర్యంగా నో అని చెప్పాలన్నారు. కేవలం చట్టాల అమలుతోనే ఈ సమస్యకు పరిష్కారం దొరకదని, సమాజంలోని అందరూ కలిసి ముందుకు రావాలని వెల్లడించారు. సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈగల్ వింగ్ ఐజీ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్) రవికృష్ణ, ఈగల్ ఎస్పీ కె.నగేష్ బాబు, సెంట్రల్ ఏసీపీ దామోదర్, బాబూరావు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగులో క్లాప్‌మిత్రలు కీలకం



కంచికచర్ల: గ్రామాల్లోని ప్రజలు తమ ఇంటికి చెత్తబండి వచ్చినప్పుడు తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసి క్లాప్‌మిత్రలకు అందజేయాలని ఎంపీడీఓ బి.ఎం.విజయలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయా పంచాయతీల కార్యదర్శులు, క్లాప్‌మిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగులో క్లాప్‌మిత్రల పాత్ర ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. తడి,పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం మెరుగునకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి బొజ్జగాని శ్రీనివాసరావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు, షెడ్‌మిత్రలు పాల్గొన్నారు.